


# పరిమళ

కొలపల్లి ఈశ్వర్

**సాయంత్రం ఆరవుతుండగా వచ్చింది ఎదురింట్లో వుండే పార్వతి. అప్పటికే నేను తయారై తనకోసం ఎదురుచూస్తూ వున్నాను.**

"వెళదామా?" అంది. చెప్పులేసుకొంటూ లోపలికి చూసి "నేను వెళ్ళొస్తానండీ" అన్నాను శ్రీవారితో. ఆయన పుస్తకం లోంచి తలెత్తి "అలాగే తొందరగా వచ్చెయ్" అనగానే తలుపులు దగ్గరగా వేసి, పార్వతితో కలిసి వీధిలోకి నడిచాను.

"మీరు బెంగుళూరుకి వచ్చి సుమారు నాలుగుమాసాలైంది కదా! ఇక్కడ 'శ్రీదుర్గా భక్త జనమండలి' గురించి ఎప్పుడూ వినలేదా?" అంది పార్వతి.

"లేదు ఈ రోజు ఉదయం నువ్వు చెప్పే దాకా దాని సంగతే నాకు తెలియదు" అన్నాను.

"సుమారు పదిహేనేళ్ళ నుంచీ నడుస్తోందీ సంస్థ. మాతా సునందాదేవిగారు దానిని స్థాపించారు. ఆశ్రమంలో వుండేదంతా ఆడ వాళ్ళే. దాదాపు ముప్పయ్ మంది వరకూ వుంటారు. వీరు కాక రోజూ భజనలో పాల్గొనడానికి వచ్చేవాళ్ళు యాభైమంది వరకూ వుంటారు. ప్రవేశం కూడా కేవలం ఆడవాళ్ళూ పిల్లలకే పరిమితం" అంది పార్వతి నడుస్తూ.

సుమారు పది నిముషాల నడక తర్వాత ఆ భజన మండలికి చేరుకున్నాము. ఆశ్రమం అంటే పూరిపాక ఏమీ కాదు. అదొక పెద్ద బిల్డింగు. గేటులో నుండి లోనికి అడుగుపెట్టాక కాస్త దూరంలో పెద్ద హాలు ఒకటి కనిపించింది. అక్కడే భజన జరుగుతోంది.

బయట చెప్పులు విడచి ఇద్దరమూ లోనికి ప్రవేశించాము. సుమారు వందమంది వరకూ కూర్చుని వున్నారక్కడ. హాలు ఎంతో నీట్‌గా, అందంగా వుంది. గోడలనిండా దేవతా మూర్తులు, పురాణాలలోని ముఖ్య ఘట్టాలు అందంగా పెయింట్ చేయబడి వున్నాయి. ఒక దేవాలయంలోని వాతావరణం అక్కడ ప్రతి ఫలిస్తోంది.

ఎదురుగా ఉన్న వేదికపై దుర్గామాత విగ్రహం, పూలమాలలతో అలంకరింపబడి వుంది. విగ్రహం ఎదురుగా తాంబూలాలతో పళ్ళు, పూలు, కొబ్బరికాయలు వగైరా భక్తుల కానుకలు వున్నాయి. అక్కడంతా అగరొత్తుల పరిమళం విరజిమ్మబడుతోంది.

హాలు మధ్యలో వలయాకారంగా వేసిన

ముగ్గు పెయింటింగ్‌పై కూర్చుని వున్నారు సుమారు పదిమంది కాషాయంబరధారులైన స్త్రీలు. వారే భక్తి గీతాలను ఆలపిస్తున్నారు. మధ్యలో కూర్చున్న ఇద్దరు స్త్రీలు పాటని పాడుతుండగా మిగిలినవారు కోరస్ ఇస్తున్నారు.

మేం ఒక పక్కగా వెళ్ళి కూర్చున్నాము. అక్కడ వున్నవాళ్ళని పరిశీలిస్తుండగా అకస్మాత్తుగా నా కళ్ళు దూరంగా ఒక మూల కళ్ళు మూసుకు కూర్చున్న వ్యక్తిపై పడ్డాయి. ఆశ్చర్యంతో మళ్ళీ పరీక్షగా చూశాను. ఆవిడ ముఖం నాకు చిరపరిచితమైనదే అనిపిస్తోంది.

ఒక్కసారిగా ఏదో జలదరింపు. ఎవరు? ఎవరు ఆ స్త్రీ? ఎక్కడ చూశానావిడని? బంధువా? స్నేహితురాలా?

ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. అలాగే తనని చూస్తూ జ్ఞాపకాల శిథిలాల్లో ఆమెని వెదుకుతున్నాను. రెండు నిముషాల తర్వాత మెరుపు మెరిసినట్లుగా గుర్తుకు వచ్చింది పరిమళ రూపం.

అవును తను పరిమళే! సందేహం లేదు. ఆ పలుచటి విల్లువంటి కనుబొమలు, సూటిగా వుండే నాసిక, దళసరి క్రింది పెదవి, నాసికకి కుడిపక్కగా పుట్టుమచ్చ. ఖచ్చితంగా పరిమళే.

వెంటనే మనసు గతంలోకి వెళ్ళిపోయింది.


❊ ❊ ❊

శ్రీవారికి వైజాగ్ ట్రాన్స్‌ఫరైంది. హైదరాబాదు నుండి మకాం వైజాగ్‌కి మార్చాం.

చిన్న వాల్తేరులోని ఒక కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నాము. ఆ ఇంట్లో దిగిన రోజు ఇప్పటికీ గుర్తే.

సామానులన్నీ దింపి వెళ్ళిపోయింది వ్యాను. అందరం కలిసి సామాను లోపల సర్దుతుంటే వచ్చింది తను హడావిడిగా. తన చేతుల్లో ఒక పెద్ద ట్రే. చనువుగా లోనికి వచ్చి, నవ్వుతూ ట్రేని బల్లపై పెట్టింది. వింతగా చూస్తున్న మమ్మల్ని చూస్తూ "గాభరా పడకండి నా పేరు పరిమళ. పక్కిల్లే మాది. మా ఆయన శ్రీరామ్. ఆంధ్రా బ్యాంకులో ఎంప్లాయి. కొత్తగా ఇంట్లోకి దిగారుకదా! అన్నీ సర్దుకునేసరికి లేటవుతుంది. ముందు ఈ బిస్కట్లూ, టీ తీసుకొని మీ పనిలో పడితే కాస్త ఉత్సాహంగా వుంటుంది. రండి మొహమాట పడాల్సిందేమీ లేదు. నేను కూడా మీతో పాటు చేయి కలుపుతాను" అంది.

ఆవిడ సహృదయానికి మెచ్చుకోకుండా వుండలేకపోయాము. అలా పరిమళతో మాకు అనుబంధం ఏర్పడింది.




**థింకర్స్ సొసైటీ, హరివిల్లు సంస్థల సంయుక్త నిర్వహణలో 25.12.04న చిలకలూరిపేటలో తోటకూర వేంకటరాయలు రచించిన "అలికిడి" నానీల సంపుటిని ఆచార్య ఎన్. గోపి ఆవిష్కరించినప్పటి దృశ్యం. చిత్రంలో కవి తోటకూర వేంకటరాయలు, సోమపల్లి వెంకట సుబ్బయ్య, ఎన్. అరుణ, ఎస్.ఆర్. భల్లం, డాక్టరు జక్కంపూడి సీతారామారావు, హరివిల్లు అధ్యక్షుడు పి.వి. రమణకుమార్ కూడా ఉన్నారు.**

క్రమంగా కొద్దిరోజుల్లోనే పరిమళ నాకు క్లోజ్ ఫ్రెండ్‌గా మారిపోయింది. హెల్పింగ్ నేచర్ గల మనిషి. క్షణంలో అందరితో కలిసిపోతుంది. 'మాటల పోగు" అని పిలుచుకుని నవ్వుకుంటూ వుండేవాళ్ళం తన గురించి. పరిమళ మాట్లాడ్డం అంటూ మొదలుపెడితే ఆగేది కాదు. ఒక మాట పూర్తి చేస్తూనే దానికి లింకుగా మరో సంగతి ఎత్తుకునేది. మొత్తానికి మంచి టైమ్ పాసే దొరికిందనుకున్నాను.

కానీ రోజులు గడుస్తున్నకొద్దీ, పరిమళపట్ల నా అభిప్రాయంలో మార్పు వచ్చింది. మొదట్లో ఎంతో నచ్చింది పరిమళ.కానీ ఆ తర్వాత తనని చూస్తేనే కోపం, అయిష్టం కలగసాగాయి. అందుకు కేవలం ఒకే ఒక్క కారణం వుంది.

పరిమళ కాలనీలో అందరితోనూ స్నేహంగా వుంటుంది. కానీ ఆడవాళ్ళతో కంటే మగవాళ్ళతోనే ఎక్కువ చనువుగా, చొరవగా, మాట్లాడుతుందని అర్థమైంది. నలుగురు మగవాళ్ళు కలిసి మాట్లాడుకుంటున్నప్పుడు కూడా వారి మధ్యకి వెళ్ళి కబుర్లు మొదలు పెడుతుంది.

కాలనీలోని మిగతా ఆడవాళ్ళు చాటుగా పరిమళని ఈ విషయంగా విమర్శించుకున్నా ఎదురుగా ఏమీ అనలేకపోయేవాళ్ళు. నాకైతే తనమీద కన్నా, తన భర్త శ్రీరామ్ పైనే ఎక్కువ కోపం కలిగేది. ఎలాంటి మనిషతను! భార్య ఇలా బరితెగించి మగవాళ్లతో కలిసి ముచ్చట్లు పెడుతుంటే చూసీచూడనట్లు వూరుకుంటాడేమిటీ అనుకునేదాన్ని.

ఏమో! వారి ఇంట్లో సంగతులెలా వున్నాయో! వీక్‌నెస్ ఏమిటో! అతనలా మౌనంగా వున్నాడంటే అందుకు తగిన కారణం ఏదో వుండి వుండాలి అనుకున్నాను. ఎందుకైనా మంచిదని రెండు మూడుసార్లు పరిమళకి బాగానే గడ్డి పెట్టాను. ఆడది కొన్ని హద్దులలో వుండడమే మంచిదని చెప్పాను. తను నా మాటలని సీరియస్‌గా తీసుకునేది కాదు. నవ్వి వూరుకునేదే తప్ప తన నడవడిని మాత్రం కొంచెం కూడా మార్చుకునేది కాదు. అది గమనించాక ఇంక తన విషయంలో జోక్యం చేసుకోవడం వృథా అనుకుని వూరకుండిపోయాను.

ఇదిలా వుండగా ఎదురింట్లో కొత్తగా సురేష్ అనే సేల్స్ రిప్రజెంటేటివ్ అద్దెకు దిగాడు. అతని భార్య సమీర. చాలా నాజూకైన మనిషి. ముట్టుకుంటే మాసిపోతుందన్నంత సున్నితంగా వుండేది. సురేష్ కూడా మంచి అందగాడే. వాళ్ళకి చేతన్, హారిక అనే ఇద్దరు పిల్లలు కూడా వున్నారు.

పరిమళ వాళ్లతోనూ స్నేహం చేసింది. వారం రోజుల్లో వారి కుటుంబంలోని వ్యక్తిగా మారిపోయింది.

సుమారు నెల రోజుల తరువాతను కుంటాను..

ఒక రోజు రైల్వే స్టేషన్‌లో రవళి అనే స్నేహితురాలిని రిసీవ్ చేసుకుని తనతో కలిసి బయటకు వచ్చాను. తనకి బాగా తలనొప్పిగా వుందంటే ఇద్దరం కలిసి ఒక హోటల్‌కి వెళ్ళి కూర్చున్నాం. కాఫీకి ఆర్డర్ ఇచ్చాక ఎందుకో కిటికీలో నుండి బయటకు చూశాను.

రోడ్డుకి అవతలి వైపున్న ఓ పెద్ద హోటల్ ముందు పరిమళ ప్రత్యక్షమైంది. లోపలి నుండి చకచకా మెట్లు దిగి వచ్చి కాసేపు అటూ ఇటూ కంగారుగా చూసి పక్కనే ఆగివున్న ఒక ఆటో మాట్లాడుకుని, ఆటోలో ఎక్కి వెళ్ళిపోయింది. నేను ఆశ్చర్యపోయాను. ఈ వేళప్పుడు తనకిక్క దేం పని? అర్థంకాలేదు...

అంతలోనే మరో విస్మయం కలిగించే సంగతి.

సురేష్ కూడా మెట్లు దిగి వస్తున్నాడు. కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ అటూ ఇటూ చూస్తూ పార్కింగ్ ప్లేస్‌లో వుంచిన తన స్కూటర్ తీసుకుని, స్టార్ట్ చేసుకుని వెళ్ళి పోయాడు.

నా మనసేదో కీడుని శంకించింది. ఏదో జరగకూడనిదే జరుగుతోంది.

పరిమళ, సురేష్ తమ వాళ్ళకి తెలియ కుండా ఇలా ఊరిమీద పడి ఎంజాయ్ చేస్తు న్నారేమోనని అనుమానం కలిగింది. ఈ అనుమానం నిజం కూడా కావచ్చు. సురేష్, పరిమళ ఈడూ జోడుగా భార్యాభర్తల్లాగే కని పిస్తున్నారు. వారిద్దరిమధ్యా ఆకర్షణ పెరిగి, బలహీనతగా మారినా ఆశ్చర్యపడనవసరం లేదు.

బుర్రనిండా వారి గురించి ఆలోచనలు చేరి నాలో అలజడీని, అశాంతినీ రేపాయి.

ఇంటికొచ్చాక కూడా అక్కడ చూసిన దృశ్యాన్నే తలచుకుంటూ మంచంలో వాలి పోయాను. రవళి తన బంధువులనెవరినో కలవడానికి వెళ్ళిపోయింది.

ఎంతో నెర్వస్‌గా వున్న నన్ను చూసి, ఆయన కంగారుపడ్డారు. ఏమైందని గుచ్చి గుచ్చి అడిగారు. నేనేమీ సమాధానం చెప్పలేక పోయాను. సాయంత్రం జ్వరం అందుకుంది.


మరునాడు సురేష్ కొడుకు చేతన్ పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు మా ఆయనతో.

“అంకుల్ అర్జంటుగా రండంకుల్. మా మమ్మీకి బాగా లేదు. డాడీ మిమ్మల్ని త్వరగా రమ్మంటున్నారు” అనేసి మళ్ళీ పరుగెత్తుకుని వెళ్ళిపోయాడు.

నాకు గుండెలో సన్నగా వణుకు పుట్టింది. సమీరకి ఏమై వుంటుందీ అన్న ఆందోళనతో ఉక్కిరిబిక్కిరైపోయాను. ఆయన చెప్పులు కూడా వేసుకోకుండా సురేష్ ఇంటికి వెళ్ళి ఐదు నిముషాల్లో తిరిగి వచ్చారు.

“ఏం జరిగింది?” అన్నాను ఆందోళనగా.

“పాపం సమీర నిద్రమాత్రలు మింగి ప్రాణాపాయ స్థితిలో వుంది. హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి” అంటూ లుంగీ తీసేసి ప్యాంట్




వేసుకుని, చెప్పులు తొడుక్కుని బయటకి వెళ్ళిపోయారు.

హతాశురాలినయ్యాను ఆ మాట విని.

బాగా నీరసంగా వున్నందువల్ల కదలలేని పరిస్థితి. కళ్ళు మూసుకొని “దేవుడా ఆ అమా యకురాలిని కాపాడు” అనుకోవడం తప్ప ఏమీ చేయలేకపోయాను.

❋ ❋ ❋

నాలుగ్గంటలసేపు మృత్యువుతో పోరాడి ఓడిపోయింది సమీర. తను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించిన భర్త, తాను నమ్మిన స్నేహితురాలు ఇద్దరూ కలిసి తనని అమా యకురాలిని చేసి తనని ఘోరంగా మోసం చేయడం ఆ సున్నిత హృదయం తట్టుకోలేక పోయింది. అందుకే సమీర చిన్నపిల్లలు వున్నా రనే సంగతి కూడా పట్టించుకోకుండా ఆత్మ హత్యకి ఒడిగట్టింది.

పరిమళ హద్దులు మీరిన ప్రవర్తన ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుని, ఇద్దరు అమా యకులైన పసివాళ్ళకు కన్నతల్లిని దూరం చేసింది.

ఈ పాపం నుండి తనకు విముక్తి లేదనే సంగతి గ్రహించినట్టుంది. పరిమళ కూడా రాత్రికి రాత్రే ఇంటి నుండి వెళ్ళిపోయింది. ఆమె ఎక్కడికి వెళ్ళిందో, ఏమయ్యిందో ఎవరికీ తెలియలేదు. ఆమె జాడ కనుక్కోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసి విసిగిపోయిన శ్రీరామ్ కూడా ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. అతనే మయ్యాడో కూడా తెలియదు.

సంవత్సరం తరువాత సురేష్ మరో పెళ్ళిచేసుకున్నాడు. కానీ, ఆ పిల్లల వేదన మాత్రం తీరేదా?

ఇదంతా జరిగి సుమారు పన్నెండేళ్ళ య్యింది.

ఇన్నాళ్ళకి ఇక్కడ మళ్ళీ పరిమళని చూస్తున్నాను.

తన మనసుని తొలిచేస్తున్న ఆ పాపం నుండి తనకి నిష్కృతి లేదని పరిమళకు తెలుసు.

అందుకే సన్యాసినిగా మారి ఈ భక్తజన మండలిలో చేరి వుంటుంది.

పరిమళను చూస్తుంటే హృదయం బాధగా మూలిగింది. ఒకప్పుడు గలగలా పారే నదిలా తుళ్ళుతూ ఆనందంగా సాగిన పరిమళ అంద మైన జీవితం చివరికిలా ఎవరికీ ప్రయోజనం లేని విధంగా మారిపోయింది.

మెల్లగా లేచి వెళ్ళి పరిమళను సమీ పించాను.

“పరిమళా” అని పిలిచాను ఆమె పక్కనే కూర్చుంటూ ఆమెకు మాత్రమే వినిపించేలా.

పరిమళ కళ్ళు తెరిచి చూసింది. కానీ, ఆ చూపులో జీవం లేదు.

“పరిమళ లేదు. ఏనాడో చచ్చిపోయింది. నువ్వు చూస్తున్నది పరిమళ తాలూకు దేహం మాత్రమే. ఈ కట్టె కూడా ఆ భగవంతునిలో లీనమయ్యే రోజు కోసమే ఈ నిరీక్షణ. అప్పుడే ఈ పాపాత్మురాలికి విమోచన. జై దుర్గా మాతా!” అంటూ కళ్ళు మూసుకుంది పరిమళ.

ఆ రోజు త్వరగా రావాలని మనసులో కోరుకుంటూ భారమైన హృదయంతో అక్కడ నుండి లేచాను. ❋